
లెబనాన్



రచన:

కంభంపాటి సత్యనారాయణ

లెబనాన్

రచన:

కంభంపాటి సత్యనారాయణ

విశాలాంధ్ర ప్రచురణాలయం,
విజయవాడ.

ప్రచురణ నెం. 296
ప్రథమ ముద్రణ
శ్రావణం, 1880
(జూలై 1958)

వెల: 25 న. పై.

ముద్రణ:
స్వతంత్ర ఆర్టు ప్రింటర్సు,
విజయవాడ.

3

లెబనాన్

భారతదేశం స్వాతంత్ర్యం సంపాదించుకొని, చైనా బహిర్ఖండమైన సోషలిస్టురాజ్యంగా అవతరించడంతో, బ్రిటిష్ పాలకుల వలసరాజ్యవ్యూహం తూర్పు ఆసియానుండి పశ్చిమ ఆసియాకు మరలింది. రెండు శతాబ్దాలు భారతదేశాన్ని ఆర్థికంగాను, రాజకీయంగాను, సైనికంగాను తమ గుప్పెట్లో పెట్టుకొని తెగబలిసిన బ్రిటన్ యీ నష్టాన్ని కొంతవరకైనా పూడ్చుకొనేందుకు పశ్చిమ ఆసియామీద తన దృష్టిని కేంద్రీకరించింది.

నైల్‌నదీ ముఖద్వారంనుండి కాస్పియన్ సముద్రం వరకు విస్తరించియున్న భూభాగంలో పశ్చిమ ఆసియా దేశాలున్నాయి. 8 కోట్ల అరబ్బుప్రజలు అక్కడ నివసిస్తున్నారు. ఈ రాజ్యాలు యిదివరకే బ్రిటిష్ ప్రాబల్యంక్రింద ఉన్నాయి. కాగా వాటిని మరింత నిర్దాక్షిణ్యంగా కొల్లగొట్టుకోడానికి బ్రిటన్ నిశ్చయించుకొంది.

పెట్టుబడిదారీ దేశాలన్నిట్లోకల్లా ఎక్కువ నూనెగనులున్న ప్రాంతం యిది. పెట్టుబడిదారీ దేశాల్లోలభించే పెట్రోలులో మూడొంతులు — సుమారు 2300 కోట్ల టన్నులు — యిక్కడే దొరుకుతుంది. అది కొద్దిపాటిలోతులో లభిస్తూండ

డంవల్ల, కూలిరేట్లు తక్కువకావడంవల్ల యిక్కడ ఉత్పత్తి ఖర్చులు బహు తక్కువ. అమెరికాలో రూపాయికి తయారయే పెట్రోలు యిక్కడ అణాకు తయారవుతుంది! ప్రపంచ మార్కెట్లో విక్రయింపబడే ధరమాత్రం ఒకటే. 1937-1955 మధ్య యీ ప్రాంతంలో నూనె ఉత్పత్తి రెట్టింపయింది. ఇక్కడ రోజువారీ ఉత్పత్తి ఉత్తర — దక్షిణ అమెరికాల్లో కంటె 389 రెట్లు హెచ్చు.

కనుకనే బ్రిటిష్ సామ్రాజ్యవాదులు రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత యీ ప్రాంతపు నూనెగనులపై పూర్తి పెత్తనం చెలాయించ దలచుకున్నారు.

అంతేకాదు. వలసయుద్ధాలలో బ్రిటన్‌కి అధికంగా సైనికులను సప్లయిచేసే దేశం; ఇండియా. కాని యిప్పుడా అవ కాశం లేనందున అరబ్బుప్రజల్ని తుపాకిమేతగా ఉపయోగించు కోదలచారు. పైగా యీ దేశాలు సోవియట్ సరిహద్దున ఉన్నాయి. సోవియట్‌మీద దాడిచేయడానికింతకంటే అను కూలమైనస్థావరాలింకెక్కడుంటాయి?

తన పథకాన్ని కార్యరూపం ధరించేటట్లు చేయడానికి బ్రిటన్ 1943 లోనే తొలిచర్యలు తీసుకొంది. 1943 జన వరిలో - అంటే ప్రపంచ యుద్ధమింకా కొనసాగుతూన్న రోజుల్లో - బ్రిటిష్ ప్రధాని చర్చిల్, అమెరికా అధ్యక్షుడు రూజ్వెల్టు కాసబ్లాంకాలో సమావేశమై ఒక రహస్య ఒడం బడిక కుదుర్చుకున్నారు. దాని ప్రకారం బ్రిటన్ పశ్చిమ ఆసియా బాల్కన్ ప్రాంతంలో సైనిక రాజకీయ "బాధ్యత" తీసుకోవాలి; దూరప్రాచ్యంలో అట్టి "బాధ్యత" తీసుకోవల

సింది అమెరికా. ఈ ఒడంబడికను 1946 లో, అంటే యుద్ధం సమాప్తమయ్యాక, బ్రిటిష్ అమెరికన్ సైన్యాధ్యక్షవర్గాలు ధృవపరచి, వివరాలతో కూడిన ఒక పథకాన్ని తయారు చేశాయి.

ఈ విధంగా అమెరికావద్ద బ్రిటన్ పశ్చిమ ఆసియాను కొంది (అది అమెరికా ఆస్తి కాకపోయినా); బ్రిటన్‌వద్ద అమెరికా తూర్పు ఆసియాను కొంది (అది బ్రిటన్ ఆస్తి కాకపోయినా) !

అంతేకాదు. పశ్చిమ ఆసియాకోసం ఆస్ట్రేలియా - న్యూజిలాండ్‌లపై తనకున్న సైనిక రాజకీయ పలుకుబడిని కూడా బ్రిటన్ ఒదులుకొంది. అరబ్బు దేశాలు సురక్షితంగా తన గుప్పెట్లో ఉన్నట్లే అది ఊహించుకొంది. దాని ధీమా అల్లా ఒక్కటే: బ్రిటిష్ - అమెరికన్ సైన్యాధ్యక్ష వర్గాల ముందు అరబ్బు ప్రజలు చేయగలదేముంది? కాని బ్రిటన్ చెప్పుచేతుల్లో ఉండడానికి అరబ్బు ప్రజలు నిరాకరించారు. వెంటనే బ్రిటిష్ పాలకులు అమెరికాకుకూడా అరబ్బు రాజ్యాల మీదపెత్తనమీయడానికి నిశ్చయించుకున్నారు. ఇలాంటి అవకాశం కొరకెదురు చూస్తున్న అమెరికా ఎగిరి గంతు వేసింది. పశ్చిమ ఆసియా నూనె గనులమీద క్రమక్రమంగా పెత్తనం సంపాదించి, బ్రిటన్‌ని చిన్న భాగస్వామిగా మార్చివేసింది. తన స్థానాన్ని పటిష్ఠ మొనర్చుకొనేందుకు టర్కీ, ఇరాక్, ఇరాన్, పాకిస్తాన్‌లను బాగ్దాద్ సైనిక కూటమిలో యిరికించి, పేరుకు తానందులో చేరకుండా బ్రిటన్‌కి మాత్రం సభ్యత్వ మిచ్చింది.

కాని త్వరలోనే యీ పథకంకూడా భగ్నంకాజొచ్చింది. ఈజిప్టు, సిరియా, సౌదీఅరేబియా, జోర్డాన్, లెబనాన్ దేశాలు బాగ్దాద్‌కూటమిలో చేరడానికి నిరాకరించాయి. ఈజిప్టుపై బ్రిటన్ - ఫ్రాన్సులు చేసినదాడిని అరబ్బురాజ్యాలు నిరసించాయి. ఈజిప్టుప్రజలు తమ స్వాతంత్ర్యాన్ని రక్షించుకొనేందుకు వీరోచితంగా పోరాడారు. వారి పోరాటానికి సోవియట్‌రష్యా సహాయంచేసింది. సామ్రాజ్యవాద సేనల్ని తరిమికొట్టడంలో ఎంతో ధైర్యాన్ని, కుశాగ్రబుద్ధిని ప్రదర్శించింది.

ఈచర్య అరబ్బుప్రజల్లో అమితోత్సాహం కలిగించింది.

ఇదంతా చూస్తున్న ఆంగ్లో అమెరికన్ సామ్రాజ్యవాదులు మళ్ళీ పశ్చిమాసియామీద దురాక్రమణ జరపడానికి అవకాశ మెప్పుడు దొరుకుతుందా అని నిరీక్షిస్తూ వచ్చారు. చివరకు లెబనాన్ ప్రభుత్వానికి సహాయంచేసే సాకుతో అమెరికాసేనలు ఆ దేశాన్ని ఆక్రమించుకొన్నాయి.

2

లెబనాన్ మధ్యధరా సముద్రాన్ని ఆనుకొనియున్న చిన్న దేశం. దీనికి తూర్పున, ఉత్తరాన సిరియా ఉంది; దక్షిణ దిశలో ఇజ్రాయిల్ ఉంది. దీని వైశాల్యం 3400 చదరపు మైళ్ళు; జనాభా 16 లక్షలు. (ప. గోదావరిజిల్లా జనాభాతో సమానం) లెబనాన్ రాజధాని బీరూట్.

(జనాభా 4 లక్షలు). ముఖ్య రేవు పట్టణం కూడా యిదే. ట్రిపోలీ, సయద్‌లు యితర రేవు పట్టణాలు. వాతావరణం సమశీతోష్ణం; వర్షాలు సరిపడా కురుస్తాయి. 10,000 అడుగుల ఎత్తుగల లెబనాన్ అనే పర్వతం ఒకటుంది. లిటానీ అనే నది సిరియానుండి లెబనాన్ గుండా ప్రవహించి సముద్రం చేరుకుంటుంది.

లెబనాన్‌లో సాగుకు లాయక్కైన భూమి తక్కువ; అందుచేత జనాభా అంతటికీసరిపడే ఆహారధాన్యాలు అక్కడ పండవు. ద్రాక్ష, గోధుమ, నిమ్మ తదితర పండ్లు ముఖ్యమైన వ్యవసాయపంటలు. అక్కడక్కడ పత్తి, పొగాకు కూడా పండుతుంది. ద్రాక్షపండ్లు, ద్రాక్షసారాయి ముఖ్యమైన ఎగుమతులు. దిగుమతులు ఆహారధాన్యం వగైరా. ముఖ్య పరిశ్రమలు సిమెంటు, జౌళి మిల్లులు; నూనెశుద్ధి కర్మాగారాలు, చిన్నచిన్న పరిశ్రమలు, వర్క్‌షాపులు ఉన్నాయి. ఎలక్ట్రిక్ పవర్‌స్టేషన్లు, పంచదార ఫ్యాక్టరీలు, ఆయిల్ మిల్లులుకూడా ఉన్నాయి. వీటన్నిటిలో పనిచేసే కార్మికుల సంఖ్య 35,000 మాత్రమే.

లెబనాన్ చాల వెనుకబడ్డ దేశం. మొత్తం జనాభాలో సగంమంది - అంటే దాదాపు 8 లక్షలు - వ్యవసాయంమీద జీవిస్తున్నారు. కాని సాగవుతున్న 3,00,000 హెక్టేర్లభూమిలో (1 హెక్టేరు 2½ యకరాలతో సమానం) చాలభాగం పెద్ద పెద్ద భూస్వాముల, దేవస్థానాల చేతుల్లోను, ప్రభుత్వంక్రింద ఉంది.

లెబనాన్‌లో అరబ్బులేకాక ఆర్మీనియన్లు, గ్రీకులు, కుర్దు జాతివారుకూడ ఉన్నారు. ఇస్లాం మతావలంబకులు 100 కి 47 గురు; క్రైస్తవులు 53 గ్గురు.

నూనె గనులీ దేశంలో లేకపోయినప్పటికీ, పొరుగు దేశాలలో లభించే నూనెను పైప్ లైన్లగుండా లెబనాన్ లోని రేవు పట్టణాలకు చేర్చబడుతుంది. అక్కడనుంచి మధ్యధరాసముద్రం మీదుగా యూరపియన్ దేశాలకు పంపబడుతుంది. అమెరికా పెత్తనంక్రింద ఉన్న ట్రాన్స్ అరేబియన్ పైప్‌లైన్ కంపెనీ ఏటా 1½ కోటి టన్నుల నూనెను పైప్ లైన్లగుండా సయీాద్ రేవుకు పంపుచేస్తుంది; బ్రిటన్, అమెరికాల పెత్తనంక్రింద ఉన్న పెట్రోలియం పైపులైన్లు ఏటా 2 కోట్ల టన్నుల నూనెను ట్రిపోలి రేవుకు చేరుస్తాయి. అదీకాక, లెబనాన్ మధ్యధరా సముద్రాన్ని ఆనుకొని యుండటంచేత పశ్చిమరాజ్యాల యుద్ధతంత్రంలో యీ దేశం కీలకస్థాన మాక్రమిస్తోంది.

13 వ శతాబ్దం తర్వాత సిరియా లెబనాన్‌లు, తదితర అరబ్బురాజ్యాలు టర్కీ సామ్రాజ్యంలో భాగాలుగా ఉండేవి. టర్కీ సామ్రాజ్యంనుంచి విడిపోవడానికి బాల్కన్ జాతుల ప్రజలు 19 వ శతాబ్దంలో పోరాటం ప్రారంభించారు. మొదట గ్రీసుతోను, తర్వాత యితర బాల్కన్ జాతుల ప్రజలతోను టర్కీ పోరాడవలసి వచ్చింది. క్రమంగా ఈ జాతీయోద్యమ వెల్లువ అరబ్బు ప్రజలకుకూడా వ్యాపించింది. 19 వ శతాబ్దం మధ్యభాగంలో సిరియాలో ప్రారంభమైన విప్లవవెల్లువ (అప్పటికి లెబనాన్ సిరియాలో భాగంగా

ఉండేది). ఈజిప్టుకు, తదితర అరబ్బు దేశాలకు విస్తరించింది. లెబనాన్‌ని టర్కీ పాలననుంచి విముక్తి చేసేందుకు అమీర్ బషీర్ బ్రహ్మాండమైన పోరాటం ప్రారంభించాడు. ఈజిప్టు రాజు మహమ్మద్ పాషాతో చేతులుకలిపి యావన్మంది ప్రజల్ని సమీకరించాడు. 1840 లో, అనగా యూరపియన్ రాజ్యాలు టర్కీ సామ్రాజ్యాన్ని తమ "రక్షణ" క్రిందికి తీసుకున్నప్పుడు బ్రిటిష్ పాలకులు బషీర్‌ని టర్కీ ప్రభుత్వానికి స్వాధీనమొనర్చారు. అతనికి దేశాంతరవాసశిక్ష విధింపబడింది. కొన్నాళ్లకు అతడు చనిపోయాడు. అమరయోధుడు అమీర్ బషీర్ స్మారకార్థం లెబనాన్‌లో ఒక కోట నిర్మింపబడింది.

1908 లో తురుష్క యువజన సమాఖ్య అనే సంస్థ (ఇది బూర్జువావర్గం పలుకుబడిక్రింద ఉండేది) నాయకత్వం క్రింద టర్కీలో విప్లవం జరిగింది. సుల్తాన్ అబ్దుల్ హమీద్ సింహాసనభ్రష్టుడయాడు. అరబ్బులలో తిరిగి జాతీయోద్యమం విజృంభించింది. అరబ్బు దేశా లన్నింటిని టర్కీ పరిపాలన నుంచి విముక్తిచేసి ఒకే అరబ్బు రాజ్యాన్ని రూపొందించేందుకు ప్రజా ఉద్యమం ప్రారంభమైంది.

ఇంతలో మొదటి ప్రపంచయుద్ధం వచ్చింది. టర్కీ జర్మనీ పక్షం వహించింది. బ్రిటిష్‌పాలకులు టర్కీక్రిందనున్న అరబ్బు దేశాలన్నింటిని విముక్తిచేసి, ఒకేఒక అరబ్బురిపబ్లిక్‌ను ఏర్పరచుకొనేందుకు సహాయపడతామని వ్రాతపూర్వకంగా వాగ్దానం చేశారు; టర్కీమీద తిరుగుబాటు చేయవలసిందని హెచ్చరికలు చేశారు; కల్నల్ లారెన్స్ అను ప్రఖ్యాత

బ్రిటిష్ గూఢచారి యీ తిరుగుబాటుకు సర్వవిధాల సహాయం చేశాడు. చివరకు తిరుగుబాటు ఫలించింది. యుద్ధం సమాప్తమయే టప్పటికి యించుమించు అన్ని అరబ్బు దేశాలు బ్రిటిష్ ఆధిపత్యం క్రిందికి వచ్చాయి. యుద్ధంలో టర్కీ ఓడిపోయింది. టర్కీ సామ్రాజ్యం ఛిన్నా భిన్నమైంది.

యుద్ధం తర్వాత యీ దేశాల భవిష్యత్తు ఏమిటనే సమస్య ఉత్పన్నమైంది. మిత్రరాజ్యాలు - ముఖ్యంగా బ్రిటన్ ఫ్రాన్సులు - అరబ్బు ప్రజలకు సంపూర్ణ స్వాతంత్ర్యమీయడమే తమ ధ్యేయమని ప్రకటనలమీద ప్రకటనలు చేశారు. కాని, వాటిని అమలుజరపడానికి ఎట్టి చర్యా తీసుకోలేదు. పైపెచ్చు బ్రిటన్ - ఫ్రాన్సులు అరబ్బు దేశాల్లో అధికభాగాన్ని కాజేయడానికి కుట్ర పన్నారు. మాండేట్స్ అనే పేరుతో ఇంగ్లండ్ కొన్ని దేశాలను, ఫ్రాన్స్ కొన్ని దేశాలను కాజేశాయి. ఇందుకు నానాజాతి సమితి ఆమోదించింది. పాలెస్టెయిన్, ఇరాక్ దేశాలను బ్రిటన్‌లాక్కొంది; లెబనాన్ భూభాగంతో సహా సిరియాను ఫ్రాన్స్ కాజేసింది.

1920 లో సిరియాలో ఫ్రెంచి హైకమిషనర్‌గా ఉన్న జనరల్ జిరాద్ ఫ్రెంచివారి ఆధిపత్యాన్ని అంగీకరించవలసిందంటూ సుల్తాన్ ఫైజుల్‌ని కోరాడు. ఫైజుల్ అంగీకరించాడు; కాని సిరియన్ నేషనల్ కాంగ్రెసు తిరస్కరించింది. వెంటనే ఫ్రెంచివారు తమ సేనలను నడిపించారు. ఫైజుల్‌రాజు పారిపోయాడు. సిరియా పూర్తిగా ఫ్రెంచివారి వశమైంది.

వెంటనే ఫ్రెంచి పాలకులు మత ప్రాతిపదికమీద సిరియాను ముక్కముక్కలుచేసి ప్రజలమధ్య ద్వేషాలను

పెంచ నారంభించారు. సిరియాను 5 చిన్న రాజ్యాలుగా విభజించి ఒకదానికీ మరోదానికీ మధ్య తంపులుపెట్టడం ప్రారంభించారు. ఆ 5 రాజ్యాలలో లెబనాన్ ఒకటి.

1920 సెప్టెంబరు 1 వ తేదీని లెబనాన్ ఫ్రెంచి మాండేటరీ రాజ్యంగా అవతరించింది. తమకు వంగి వంగి సలాములు చేసేతాజేదార్లతో ఒక పాలకసంఘాన్ని ఫ్రెంచివా రేర్పరచారు. జనరల్ జిరాద్ నూతన లెబనాన్ రాజ్యాన్ని కీర్తిస్తూ యిలాచెప్పాడు: "మీ దేశానికి పెట్టని కోటగాఉంటూ సర్వవిధాల రక్షిస్తూన్న యీ మహాపర్వత (లెబనాన్ పర్వతం) సాన్నిధ్యంలో పూర్వం గ్రీసు, రోమ్, ఫినీషియా దేశాల మహోన్నత వైభవంతో సహచర్యం నెరపి, తిరిగి ఈనాడు అత్యుదారమైన ఫ్రెంచి పోషణ భాగ్యం పొందగలిగిన యీ ప్రాంతంలో పేరెన్నికగన్న ఫ్రెంచి ప్రజాస్వామిక ప్రభుత్వం పేరిట గ్రేట్ లెబనాన్ రాజ్యరమణికి వందనం చేస్తున్నాను."

త్వరలోనే లెబనాన్‌కి ఒక ఫ్రెంచి గవర్నరూ, కొందరు ఫ్రెంచి "సలహాదారులూ" తయారయ్యారు.

లెబనాన్‌లో 100 కి 47 గురు మహమ్మదీయులనీ, 53 గురు క్రైస్తవులనీ పైన పేర్కొన్నాను. క్రైస్తవులు మెరొనైట్లు అనే పేరుతో వ్యవహరింప బడతారు. బ్రిటిష్‌వారు భారతదేశంలో హిందూ - ముస్లిం ల మధ్య ద్వేషాలను, కలహాలను రెచ్చగొట్టి వారిమధ్య ఐక్యత కుదరకుండా చేసినట్లే, ఫ్రెంచివారు లెబనాన్‌లో ముస్లింలకు, మెరొనైట్లకు మధ్య తంపులుపెడుతూ వచ్చారు. ఫ్రెంచివారు రూపొందించిన రాజ్యాంగాన్ని నడిపేందుకు ఉభయ

మతాలకు చెందిన కొందరు నాయకులు ఒక ఒప్పందం కుదుర్చుకున్నారు. నిజానికి యీ ఒప్పందం ఫ్రెంచి తాబేదారులమధ్య జరిగిన అధికారపంపకం. ఉభయులమధ్య "ఐక్యత" ను కాపాడే పేరుతో ఫ్రెంచి సామ్రాజ్యవాదులు తమ ప్రయోజనాలను బహు జాగ్రత్తగా రక్షించుకొంటూ వచ్చారు.

ఫ్రెంచి వలసరాజ్యాధిపతు లిన్ని యేర్పాట్లు చేసుకున్నప్పటికీ, ప్రజల స్వాతంత్ర్యవాంఛను అణచలేకపోయారు. లెబనాన్‌లో అనేకమంది ప్రముఖ వ్యక్తులు కలిసి ఫ్రెంచి పాలన అంతంకావాలనీ, సిరియాతో లెబనాన్ ఐక్యం కావాలనీ తీర్మానం చేశారు. అలా తీర్మానించినవా రందరినీ ఫ్రెంచి పాలకులు అరెస్టుచేసి దేశాంతరం వెళ్ళగొట్టారు. ఫ్రెంచి సామ్రాజ్యవాదులమీద ఎన్నో ఆశలు పెట్టుకొన్న మెరొనైట్లకు సైతం ఫ్రెంచి పాలన అంటే మొగం మొత్తనారంభించింది.

3

1939 లో రెండవ ప్రపంచయుద్ధం ప్రారంభమైంది. 1940లో ఫ్రాన్స్ హిట్లరుకు దాసోహం చేయడంతో సిరియా, లెబనాన్ ప్రజలు స్వాతంత్ర్యవాంఛను ప్రకటించారు. 1941 లో ఫ్రెంచి ప్రభుత్వం సిరియా, లెబనాన్‌ల స్వాతంత్ర్య హక్కును గుర్తించవలసి వచ్చింది. 1943 నవంబరు 22 వ

తేదీని ఫ్రెంచి ప్రభుత్వం లెబనాన్ ప్రజల ఒత్తిడికి తట్టుకో లేక, జైల్లో నిర్బంధింపబడ్డ ప్రభుత్వ సభ్యులందరినీ విడుదల చేసి, బెషారా ఎల్‌ఖౌరీకి తిరిగి అధ్యక్షస్థాన మిచ్చింది. ప్రజాసమూహం అమితోత్సాహంతో అధ్యక్ష భవనం ముందు, మంత్రుల భవనాలముందు చేరి ఆనందోత్సవాలు చేసుకున్నారు. లెబనాన్‌కి సంపూర్ణ స్వాతంత్ర్య మీయాలనే నినాదాలతో దేశమంతటా ఊరేగింపులు జరిగాయి. దేశ వ్యాపిత సమ్మెకు పిలుపుకూడా యివ్వబడింది. ఫ్రెంచి సామ్రాజ్యవాదులు, వారి బంట్లు ప్రజా ఉద్యమాన్ని వక్ర మార్గానికి త్రిప్పి అణచివేసేందుకు ఒక కుట్ర పన్నారు. కాని అది భగ్నం చేయబడింది.

ఫ్రెంచివారు యుద్ధం ముగియలేదనే కారణంతో సైన్యంమీద, పోలీసుశాఖమీద, ఎగుమతి – దిగుమతులమీద అధికార మీయడానికి వీల్లేదని చెప్పారు. జాతీయవాదులు యుద్ధం కొనసాగుతున్నంతకాలం ఫ్రెంచి సైనికుల్ని లెబనాన్‌లో ఉండనిస్తామన్నారు; కాని జాతీయ ప్రభుత్వానికి సర్వాధికారా లుండాలన్నారు. రెండవ ప్రపంచ యుద్ధం జరుగుతూన్నప్పుడు మన కాంగ్రెసు అడిగిన కోరికవంటిదే యిదీను. ఉభయపక్షాలమధ్య సంప్రతింపులు ప్రారంభ మయాయి. సిరియా, లెబనాన్ ప్రతినిధులు సమైక్యతతో నిలబడ్డంవల్ల సంప్రతింపులు కొంతవరకు ఫలించాయి. ముఖ్యమైన ప్రభుత్వశాఖలు జాతీయ ప్రభుత్వాలకు స్వాధీనం చేయబడ్డాయి. ఫ్రెంచివారు కొన్ని ప్రత్యేకాధికారాలను ఉంచుకోడానికి తీవ్రమైన ప్రయత్నాలు చేశారు.

కాని సిరియా, లెబనాన్ ప్రతినిధివర్గాలు గట్టిగా నిలబడ్డం వల్ల ఆ ప్రయత్నాలు ఫలించలేదు.

యుద్ధం సమాప్తమయాక లెబనాన్ ప్రజల స్వాతంత్ర్యోద్యమం మహోన్నత శిఖరం అందుకొంది. నాజీజర్మనీపై యుద్ధం ప్రకటించి మిత్రరాజ్యాలతరఫున పోరాడిన లెబనాన్, సిరియాల ప్రతినిధులు శాన్‌ఫ్రాన్సిస్కో మహాసభకు ఆహ్వానింపబడ్డారు. ఐక్యరాజ్యసమితిలో ఆ రెండు రాజ్యాలకు సభ్యత్వ మిచ్చారు.

కాని ఫ్రెంచి సైనికు లింకా సిరియా, లెబనాన్‌లలోనే ఉన్నారు. వారిని దేశంనుంచి సాగనంపడానికి జాతీయవాదులు నిశ్చయించుకున్నారు. ఈ సమస్యపై సంప్రతింపులు ప్రారంభమయాయి. ఫ్రెంచివారు తమ సైనికుల్ని వెనక్కు పిలిపించే విషయంలో కాలయాపన చేయదలచుకున్నట్లు స్పష్టమైంది. ఉదాహరణకు జపాన్‌మీద యుద్ధం కొనసాగించడానికి యూరప్ - ఆసియాల మధ్య రాకపోకలు సురక్షితంగా జరగాలనీ, అందుకోసం తమ సైన్యా లుండాలనీ వాదించ నారంభించారు. లెబనాన్, సిరియాల ప్రతినిధు లిందుకు నిరాకరించారు.

చివరకు బ్రిటన్, ఫ్రాన్సులు 1945 డిసెంబరులో ఒక సంయుక్త ప్రకటన చేస్తూ, సిరియా లెబనాన్‌లనుంచి ఫ్రెంచి సైనికుల్ని తరలించే విషయ మాలోచించడానికి బీరూట్‌లో సైనిక నిపుణుల సమావేశ మొకటి జరుగుతుందని తెలియజేశారు. కాని సంప్రతింపులు ప్రారంభమయినరోజున సిరియా–లెబనాన్‌ల ప్రతినిధుల కందులో స్థానంలేదని స్పష్టమైంది.

అంతేకాక, "రక్షణకోసం" ఫ్రెంచిసేనలేకాక బ్రిటిష్ సేనలు కూడా లెబనాన్‌లో తిష్టవేయడానికి ఒక పథకం తయారవుతున్నట్లు తెలుసుకున్నారు. ఇది రెండు, దేశాల ప్రజల్నీ ఆగ్రహావేశుల్ని చేసింది.

ఈ సమస్య 1946 లో భద్రతాసమితిలో చర్చకు వచ్చింది. సోవియట్ ప్రతినిధి పదే పదే లెబనాన్‌లో బ్రిటిష్, ఫ్రెంచి సేన లుండకూడదని పట్టుపట్టాడు. ఆ రోజుల్లో లెబనాన్ మంత్రివర్గ సభ్యుడుగాఉన్న షామూన్ (అతడే యిప్పుడు లెబనాన్ అధ్యక్షుడుగా ఉన్నాడు) విదేశీసేనల ఆక్రమణ విషయంలో సోవియట్ ప్రతినిధి ప్రదర్శించిన వైఖరిని శ్లాఘిస్తూ తన స్వీయచరిత్రలో యిలా వ్రాసుకున్నాడు:

"సిరియా, లెబనాన్ దేశాల ఫిర్యాదులపై చర్చ వివిధ దశల్లో కొనసాగింది. పూర్తి ఆధారాలతో మేము చూపిన సాక్ష్యం, అతి నిశితమైన మా వాదనలు తృణీకరింపబడ్డాయి. సోవియట్ ప్రతినిధి మాత్రమే మా తరఫున గట్టిగా వాదించాడు."

ఈ విధంగా సిరియా, లెబనాన్ దేశాల ప్రజలు, నాయకులు ఎట్టకేలకు తమ భూభాగంలో ఒక్క ఫ్రెంచి సైనికుడుగాని, బ్రిటిష్ సైనికుడుగాని లేకుండా చేసుకొని, 1947 లో సర్వం సహాధికారం ప్రకటించుకున్నారు.

16

4

రెండవ ప్రపంచయుద్ధంవరకు ఆర్థికాభివృద్ధి విషయంలో సిరియా, లెబనాన్‌ల మధ్య చెప్పుకోదగ్గ వ్యత్యాసం లేదు. ఫ్రెంచి మాండేటరీ పరిపాలనక్రింద వున్న యీ రెండు దేశాలలో బ్యాంకులు మాత్రమే ఫ్రెంచి గుత్త పెట్టుబడిదారుల కంట్రోలులో ఉండేవి; పరిశ్రమలను, వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకొనే అవకాశం దేశీయ పెట్టుబడిదారులకు కొంతవరకు వుండేది.

ఆ అవకాశం 1947 తర్వాత - బ్రిటిష్ ఫ్రెంచి సైనిక దళాలు ఉపసంహరింపబడ్డ తర్వాత - హెచ్చింది. అయితే ఉభయ దేశాలు ఆర్థికాభివృద్ధి విషయంలో విభిన్నమార్గాలు చేబట్టాయి. లెబనాన్‌లోని బీరుట్ రేవుపట్టణం తూర్పు మధ్యధరా రేవు పట్టణా లన్నిటికంటె పెద్దది. దీనిమీదుగా జరిగే బ్రహ్మాండమైన ఎగుమతి - దిగుమతి వ్యాపారం లెబనాన్‌కి చాల లాభదాయకంగా వుంది. ఏటా 20,00,000 టన్నుల బరువుగల సరుకు బీరుట్ రేవుమీదుగా రవాణా అవుతుంది. పశ్చిమాసియాతో జరిగే వర్తకానికి యిదొక ముఖ్యమైన కేంద్రం. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, ప. జర్మనీ దేశాలనుండి సిరియా, జోర్డాన్, ఇరాక్, సౌదీ అరేబియా దేశాలకు ఎగుమతి చేయబడే సరుకులు యీ రేవులోనే దిగుతాయి. ఈ పరిస్థితిని లెబనాన్ వ్యాపారస్తులు చక్కగా వినియోగించుకొన్నారు. జనా

భాలో చాలమంది ఏదో ఒకవిధంగా వ్యాపారంతో సంబంధ మున్నవారే. ఈ సందర్భంలో ఒక కథ వాడుకలో ఉంది. గురువు శిష్యుణ్ణి అడిగాడట: "రెండు రెళ్లు ఎంత?" శిష్యుడు: "మీరు సరుకులు కొంటున్నారో అమ్ముతున్నారో మొదట చెప్పండి!"

లెబనాన్‌లో ప్రాబల్యం వహిస్తున్నవర్గం విదేశ వ్యాపారంమీద ఆధారపడే దళారీవర్తకులు. వీరి ఆదాయం ఎగుమతి - దిగుమతులమీద ఆధారపడి ఉంటుంది. రాజకీయంగా వీరు పశ్చిమరాజ్యాలవైపు ఉంటారు. కాని అరబ్బుదేశాలతో సంబంధాలు తెగ్గొంచుకోవాలని కోరరు. కారణమేమంటే, తమ వర్గంయొక్క ఆర్థికస్తోమతుకు అది అవసరం.

సిరియా - లెబనాన్‌లమధ్య సరకులను స్వేచ్ఛగా రవాణా చేసుకునేందుకు 1948 వరకు ఒక ఒడంబడిక అమల్లో ఉండేది. 1948 లో వాణిజ్యవర్గాల అభీష్టానికి వ్యతిరేకంగా అది రద్దుచేయబడింది.

సిరియాదేశం లెబనాన్‌వలెకాక పారిశ్రామికాభివృద్ధి మీద తన దృష్టిని కేంద్రీకరించి పనిచేస్తూంది. అందుచేత అక్కడ జాతీయ పెట్టుబడిదారీవర్గం అంతకంతకు ప్రాబల్యం వహిస్తూ వచ్చింది. బ్యాంకులకు మాత్రమే విదేశీ పెట్టుబడులు పరిమితమయిఉన్నాయి. లెబనాన్‌లో అలాకాక, పరిశ్రమలమీద విదేశీపెట్టుబడుల ప్రాబల్యం విస్తారంగాఉంది. ఈ వైరుధ్యం ఉభయదేశాల విదేశాంగవిధానంలో స్పష్టంగా మనకు గోచరిస్తుంది.

లెబనాన్‌లో ఒకే శాసనసభ ఉంది. 1952 వరకు పురుషులకు మాత్రమే ఓటింగ్ హక్కు ఉండేది. కాని 1952 లో స్త్రీలకు కూడా ఆ హక్కు యివ్వబడింది. 1950 వరకు లెబనాన్‌లో నివసించేవారు మాత్రమే ఎన్నికల్లో పాల్గొనేందుకు అవకాశం ఉండేది. 1950 లో ఖండాంతర వాసులకు కూడా ఓటింగ్ హక్కు లభించింది. ఒక్క అమెరికాలోనే 10 లక్షలమంది లెబనీస్ పౌరు లున్నారు. వారందరూ యిప్పుడు ఎన్నికల్లో పాల్గొంటున్నారు. ఈ హక్కును ఖండాంతరవాసులకు కూడా యివ్వడంలో ఒక ఆంతర్యం ఉంది. చట్టంప్రకారం లెబనాన్ ప్రత్యేక రాజ్యంగా మనగలగాలంటే, ఆ దేశ జనాభాలో కొద్దిపాటి మెజారిటీగల క్రైస్తవులు ఎల్లప్పుడూ స్థిరమైన మెజారిటీలో ఉండాలి. కాని యిటీవలి సంవత్సరాల్లో క్రిస్టియన్ జనాభాకంటె ముస్లిం జనాభా త్వరితంగా పెరుగుతూంది. ఈ పెరుగుదల మొత్తం రాజ్యాంగాన్నే తలక్రిందులు చేయవచ్చునన్న భయంతో ఆనాటి ప్రభుత్వం ఖండాంతరవాసులకుకూడా ఓటింగ్‌హక్కు యిచ్చింది. ప్రజా ప్రతినిధుల సంఖ్య కూడా 55 నుంచి 77 కి పెంచ్చింపబడింది.

19

5

రాజకీయంగా స్వాతంత్ర్యం పొందిన లెబనాన్‌ను ఆర్థికంగాను, యుద్ధతంత్ర రీత్యాను తమ గుప్పెట్లో ఉంచుకోడానికి బ్రిటిష్, అమెరికన్ సామ్రాజ్యవాదులు 1950 తర్వాత తీవ్ర ప్రయత్నాలు ప్రారంభించారు.

బ్రిటిష్‌వారు ఇరాక్, జోర్డాన్, సిరియా, లెబనాన్‌లను కలిపి ఒక సమాఖ్యగా నిర్మించి, దాన్ని తమ చెప్పు చేతలలో ఉంచుకోడానికి ఒక పథకం తయారుచేశారు.

కాని అమెరికా యీ స్కీమును వ్యతిరేకించింది. సిరియా, లెబనాన్‌ల విషయమై అమెరికా ఆలోచన వేరు. సిరియాలోని అమెరికన్ తాబేదార్లు బ్రిటిష్ పథకాన్ని పూర్తిగా భగ్నంచేశారు. అనేక సైనిక తిరుగుబాట్ల తర్వాత 1951 లో ఒక నిరంకుశ సైనిక ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. "అమెరికాతో సిరియా స్నేహంగా ఉంటుం"దని ఆ ప్రభుత్వం ఒక ప్రకటన చేసింది. ఈ పరిణామాలవల్ల బ్రిటన్ తన పథకాన్ని ఒదులుకోవలసి వచ్చింది.

అరబ్బుదేశాలపై పెత్తనం సంపాదించేందుకు బ్రిటన్-అమెరికాల మధ్య సాగుతున్న సంఘర్షణ మరింత తీవ్రరూపం ధరించింది; రాయబార కార్యాలయాలతో రహస్య సంప్రతింపులు జరిపే దిశనుండి ప్రతి దేశంలో తమ తాబేదార్లను, గూఢచారులను నియమించి వారిద్వారా పెత్తనం చెలాయించే దశ ప్రారంభమైంది. బ్రిటన్ చాల అననుకూల పరిస్థితుల్లో

అమెరికా కుట్రల నెదుర్కోవలసి వచ్చింది. ఇతర పశ్చిమ ఆసియా రాజ్యాలపై బ్రిటన్ చాల సంవత్సరాలు పెత్తనం చెలాయించడంవల్ల అనేకమంది ప్రజ్ఞావంతులైన గూఢ చారుల్ని తయారుచేసుకో గలిగింది. కాని సిరియా, లెబనాన్‌ల విషయం అలాకాదు. 1920 నుంచి ఆ రెండు రాజ్యాలు ఫ్రెంచి పలుకుబడిక్రింద ఉండడంవల్ల ఆ దేశాల్లో బ్రిటన్ తన తాబేదార్లను సంపాదించుకోలేక పోయింది. కాని అమెరికా విస్తారంగా డాలర్లను విరజిమ్మి చాలమంది తాబే దార్లను సులభంగా తయారు చేసుకోగలిగింది. అందుచేత లెబనాన్‌లో అమెరికా పలుకుబడి ప్రబలం కాజొచ్చింది.

అమెరికావారు లెబనాన్‌లో తమ స్థానాన్ని బల పరచుకొనేందుకు చతుస్సూత్ర ప్రణాళిక క్రింద ఆర్థిక సహాయం చేయ నారంభించారు. 1951 మే మాసంలో లెబనాన్ - అమెరికాల మధ్య ఒక ఒప్పందం కుదిరింది. పేరుకు అది ఒప్పందమేగాని, లెబనాన్‌ని దాస్యశృంఖ లాల్లో బంధించియుంచే ఉచ్చు అది. లెబనాన్ ప్రజ లిది గ్రహించారు. దేశమంతటా యీ ఒడంబడికను నిరసిస్తూ ప్రదర్శనలు జరిగాయి. రెండోవైపున ఫ్రెంచి, బ్రిటిష్ గూఢచారులు రహస్యకుట్రలు ప్రారంభించారు. ఈ కార ణాలవల్ల నవంబరుమాసంవరకు పై ఒప్పందం పార్లమెంటుచే ధృవపరచబడ లేదు. ఫ్రాన్స్ లెబనాన్‌లోని తన పెట్టుబడు లేమైపోతాయోనన్న భయంతో బ్రిటన్ పక్ష మవలంబిం చింది. చివరకు అమెరికా 1951 నవంబరులో లెబనాన్ శాసనసభచే పై ఒప్పందాన్ని ధృవపరచుకో గలిగింది. అది

కూడ చాల కష్టంమీద! 77 గురు సభ్యులున్న శాసన సభలో బొటాబొటీగా 40 మంది మాత్రమే ఒప్పందానికి అనుకూలంగా ఓటు చేశారు.

బ్రిటిష్ ఏజంట్లు ఎదురుదాడికి సన్నద్ధు లయారు. 1952 ఆఖరాలు కాలంనాటికి - 19 మంది శాసనసభ్యుల్ని సంపాదించి, పార్లమెంటరీ ప్రతిపక్షం ఒకటి ఏర్పరచగలిగారు. వారంతా "సోషలిస్టు నేషనల్ ఫ్రంట్" అనే పేరుతో వ్యవహరించసాగారు. కెమాల్ జంబ్లాట్ అను సోషలిస్టు, కెమిల్లీ షామూన్ అను స్వతంత్రుడు వారి నాయకులు (ఆ షామూనే యిప్పుడు లెబనాన్ అధ్యక్షుడు).

1952 సెప్టెంబరునాటి పరిస్థితి ఏమంటే: లెబనాన్ అధ్యక్షుడు బిషారా ఎల్‌ఖౌరీకి అమెరికాతో రాజకీయ సంబంధాలే కాక వ్యాపారసంబంధాలు కూడా ఉండేవి. యుద్ధానంతరం అతడు అమెరికాలో 52,00,000 డాలర్లకు ఒక పెద్ద ఎస్టేటును కొన్నాడు; కొన్ని లక్షల డాలర్లను అమెరికన్ బ్యాంకులలో నిల్వ చేసుకున్నాడు. అతని కొడుకు ఖలీల్ ఖౌరీకి కోకా - కోలా (అమెరికా శీతల పానీయం) వ్యాపారంలో చాలా షేర్లు ఉన్నాయి. లెబనాన్ పార్లమెంటు లోని 77 గురు సభ్యులలో 57 గురు బిషారా గ్రూపును బలపరచేవారు. ఈ గ్రూపుయొక్క ప్రముఖ నాయకులందరు ఏదో ఒకవిధంగా అమెరికాతో వ్యాపారసంబంధా లున్న వారే.

బిషారా ఎల్ ఖౌరీ అధికారంలో ఉన్న 10 సంవత్స రాల్లోను లెబనాన్ ప్రజలు భరించశక్యంకాని బాధలు

అనుభవించారు. చాలకాలంనుంచి వారి నెమరొ్కంటూన్న ప్రధాన సమస్య వ్యవసాయ సమస్య. రైతులకు యించుమించు సొంతభూములులేవనే చెప్పాలి. దేశంలోని పెద్ద పెద్ద ఫ్యూడల్ ఎస్టేట్లను రద్దుచేయాలనే ఆందోళన చాల కాలంనుంచి సాగుతూంది. అంతేకాదు; లెబనాన్‌లోని పెట్టుబడులలో 100 కి 93 వంతులు విదేశీయులవి. 1954 లో కొందరు అమెరికన్ ప్రముఖులు పశ్చిమ ఆసియాలో అమెరికా అనుసరించే విధానాన్ని సమీక్షిస్తూ అమెరికా అధ్యక్షుని కొక మెమొరాండం సమర్పించారు. అందులో వారు "పశ్చిమ ఆసియాకు 30 సంవత్సరాలుగా సహాయం లభిస్తూన్నప్పటికీ, అరబ్బుదేశాల స్నేహాన్ని మనం సంపాదించలేకపోయాం," అని వ్రాశారు. అంతేకాదు. ఆ సహాయం అరబ్బు ప్రజల పరిస్థితిని చక్కబరచకపోగా మరింత అధ్వాన్న పరిస్థితులను తెచ్చిపెట్టిందని విమర్శించారు. ఈ ప్రాంతంలో కరువు, దారిద్ర్యం విలయతాండవం చేస్తున్నాయనీ, యిట్టి పరిస్థితి పాశ్చాత్యుల "భావనా ప్రపంచానికి అందని విషయ" మనీ వారన్నారు. "అవిద్య యించుమించు సర్వవ్యాపితంగా ఉంది. చావులు ఏ దేశంలోనూ లేనంత నిష్పత్తిలో ఉన్నాయి" అని కూడా వ్రాశారు.

పశ్చిమ ఆసియా ప్రజల పరిస్థితిని వర్ణిస్తూ అమెరికన్ పౌరులు వ్రాసిన వాక్యాలు యివి. వీటిపై వేరే వ్యాఖ్యానం అనవసరం.

లెబనాన్ ప్రజల ఆర్థిక దుస్థితికి కారణం విదేశీపెట్టుబడిదారుల, ఫ్యూడల్ భూస్వాముల దోపిడీయేనని చాల

మంది తెలుసుకోగలిగారు. లెబనాన్‌వంటి చిన్న దేశంలో (1951 నాటి జనాభా లెక్కలనుబట్టి లెబనాన్‌లో 13 లక్షల మంది నివసించేవారు) 65,000 మంది నిరుద్యోగులు ఉండే వారంటే అది చిన్న విషయమేమీ కాదు. అదీకాక బిషారా హయాంలో లంచగొండితనం పెచ్చుపెరిగింది. అమెరికాతో అతడు చేసుకున్న ఒడంబడిక లెబనాన్ ప్రజల్ని క్రోధావేశు లోనచ్చింది. పాశ్చాత్యరాజ్యాలు రూపొందించిన సైనిక కూటమిలో చేరడానికి లెబనాన్ అధ్యక్షుడు తన సంసిద్ధతను ప్రకటించడంతో ప్రజల ఆగ్రహానిక అంతులేకపోయింది.

1952 సెప్టెంబరులో దేశమంతటా ప్రజా ఉద్యమం ప్రజ్వరిల్లింది. పీపుల్స్‌ఫ్రంట్ అనే సంస్థ దానికి నాయకత్వం వహించింది. ఇందులో అభ్యుదయభావాలుగల నేషనల్ కాంగ్రెసుపార్టీ, ప్రభుత్వ వ్యతిరేక బూర్జువాగ్రూపులు ఉన్నాయి. సెప్టెంబరు 15 వ తేదీని పీపుల్స్‌ఫ్రంట్ దేశ వ్యాపితసమ్మెకు పిలుపు యిచ్చింది. ముఖ్యమైన నగరాలన్నీ ఆ పిలుపు నందుకొన్నాయి. 17 వ తేదీని ప్రతిపక్షపార్టీలకు, గ్రూపులకు చెందిన వారంతా సమావేశమై, వెంటనే అధ్యక్షుడు రాజీనామా నివ్వాలని కోరుతూ తీర్మానించాయి. అప్పుడు సాయిబ్ సలాం ప్రధానమంత్రిగా ఉండేవాడు. అధ్యక్షునికి రాజకీయ సలహాదారుకూడా అతడే. అధ్యక్షుడు తన స్థానాన్ని కాపాడుకొనేందుకు సాయిబ్ సలాంని డిస్మిసు చేసి, అతనిస్థానంలో చేహాబ్ అనే పేరుగల సర్వసేనానిని నియమించాడు.

కాని సైన్యం బిషారా ఎల్ ఖౌరీని బలపరచడానికి నిరాకరించింది. సెప్టెంబరు 18 వ తేదీని అతడు రాజీనామా యిచ్చాడు. నేషనల్ కాంగ్రెసుపార్టీ తన ప్రణాళికలో "పోరాటంయొక్క మొదటి దశ జయప్రదంగా ముగిసింది," అని తెలియజేసింది. "లెబనాన్ ప్రజలందరూ, రాజకీయ సంస్థలన్నీ, ట్రేడ్ యూనియన్లన్నీ, కార్మిక కర్షకులంతా" జాతీయైక్య సంఘటనలో చేరి, సాంఘిక రాజకీయ సంస్కరణ లకై పోరాడవలసిందంటూ నేషనల్ కాంగ్రెసుపార్టీ విజ్ఞప్తి చేసింది. కాని ప్రతిపక్ష నాయకులు యీ విజ్ఞప్తిని పాటించ లేదు. వారు "విప్లవం" సమాప్త మయిందనీ, కొత్త అధ్యక్షుణ్ణి ఎన్నుకొంటే చాలుననీ తెలియజేశారు. తదను గుణ్యంగా షామూన్‌ని అధ్యక్షుడుగా ఎన్నుకొన్నారు.

ప్రజా ఉద్యమంయొక్క ప్రభావంవల్ల పార్లమెంటులో అమెరికాను బలపరచే పక్షం కుప్పకూలినట్లు కూలిపోయింది. సెప్టెంబరు 23 వ తేదీని జరిగిన అధ్యక్ష ఎన్నికలో పార్ల మెంటులోని 76 గురు సభ్యుల్లోను 74 గురు షామూన్‌ని బలపరుస్తూ ఓటుచేశారు.

కాని, అధికారంలోకి వచ్చినది బ్రిటిష్ అనుకూల గ్రూపు; అమెరికన్ అనుకూలగ్రూపు తిరిగి అధికారంలోకి వచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. ఈ గ్రూపు నూతన అధ్యక్షుణ్ణి చిక్కుల్లోపెట్ట నారంభించింది. షామూన్ కొత్త మంత్రిమండలిని నియమించే సందర్భంలో ప్రధాని తమ కనుకూలుడై ఉండాలని అమెరికన్‌గ్రూపు పట్టుపట్టింది. అధ్యక్షుడు కోరుకున్న ప్రధానుల్ని ఒకరితర్వాత ఒకరిని వారు

త్రోసిపుచ్చారు. పార్లమెంటులో మెజారిటీగల పాత అధ్యక్షుని అనుచరులు తమ ప్రతినిధుల్నే మంత్రులుగా ఎన్నుకోడానికి నిశ్చయించుకున్నారు. అధ్యక్షుడు విధిలేక ప్రత్యేక ఉత్తరువుద్వారా ఒక తాత్కాలిక మంత్రిమండలిని నియమించవలసి వచ్చింది. చెహాబ్‌ని అతడు ప్రధానిగా నియమించాడు. పార్లమెంటును రద్దుచేసి కొత్తఎన్నికలు జరపడానికి వీలుగా రాజ్యాంగచట్టాన్ని సవరించమని అతనిని ఆదేశించాడు.

పార్లమెంటులో అమెరికన్ అనుకూలగ్రూపుకు మెజారిటీ లేకుండా చేయడానికి బ్రిటిష్ అనుకూలగ్రూపు పన్నిన పన్నాగం యిది. చెహాబ్ మంత్రిమండలి ఆధ్వర్యాన జరిగేకొత్త ఎన్నికలు తమకనుకూలంగా పరిణమిస్తాయని వారెరుగుదురు. అంతేకాదు. కొత్త ఎన్నికల చట్టాన్ననుసరించి పార్లమెంటు సభ్యుల సంఖ్య 77 నుంచి 44 కి తగ్గింపబడింది.

ఐతే ప్రభుత్వం అంతకంతకు అనేక చిక్కుల నెదుర్కోవలసి వచ్చింది. ప్రజల కది వాగ్దానం చేసిన సాంఘిక, రాజకీయ సంస్కరణలను ప్రవేశపెట్టనందున దేశంలో అసంతృప్తి పెచ్చరిల్లింది. దీనికితోడు బ్రిటిష్ అనుకూల గ్రూపులో చీలిక ఏర్పడింది. "సోషలిస్టు నేషనల్ ఫ్రంటు" నాయకుడు జంబ్లాట్ బహిరంగంగా ప్రభుత్వ వ్యతిరేక వైఖరిని ప్రదర్శించాడు. ఎందుచేతంటే, 1952 సెప్టెంబరులో షామూన్ కొత్త ప్రభుత్వాన్నేర్పరచినప్పుడు యితని అనుచరు లెవరినీ మంత్రివర్గంలోకి తీసుకోలేదు. అంతేకాదు. అమెరికన్ అనుచరులు పెద్ద సంఖ్యలో పార్లమెంటు సమావేశాలకు గైరుహాజరవుతూ, కోరం (సమావేశాలకు అవసర

మయే కనీసనంఖ్య లేకాకుండా చేస్తూ తరచు ప్రతిష్టంభనలు తెచ్చిపెడుతూవచ్చారు.

ఈ విధంగా చెహాబ్ ప్రభుత్వానికి యిటు పార్లమెంటులోగాని, అటు ప్రజల్లోగాని పలుకుబడి లేకుండా పోయింది. ఇట్టి పరిస్థితుల్లో మంత్రివర్గం 1953 ఏప్రిల్‌లో రాజీనామా యివ్వవలసి వచ్చింది. షామూన్ బిషారా అనుచరుల్లో ఒకడైన సాయిబ్ సలాంని ప్రధానిగా నియమించాడు. మే 1 వ తేదీని సలాం కొత్త మంత్రివర్గాన్ని నియమించాడు. ఇందుకు అమెరికా రాయబారి తన హర్షాన్ని ప్రకటించాడు. వెంటనే పార్లమెంటులో తమ స్థానాన్ని బలపరచుకొనేందుకు అమెరికా అనుకూలురు అన్ని పద్ధతులూ అవలంబించారు. మెజారిటీ సభ్యులు ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు చేసేటట్లు చేయడానికి ధనం మంచినీళ్ళ ప్రాయంగా ఖర్చు చేయబడింది. ఒక్కొక్క ఓటుకు 20,000 లెబనీస్ పౌన్లు ఖర్చు చేయబడినట్లు పత్రికల్లో వార్తలు వచ్చాయి. వాతావరణం మరీ కల్మషభూయిష్టంగా తయారవడంవల్ల పార్లమెంటు రద్దు చేయబడింది. కొత్త ఎన్నికలు జరిగాయి. అమెరికా అనుకూలురు పెద్ద సంఖ్యలో ఎన్నుకోబడ్డారు. వారి చెప్పుచేతల్లో ఉండేవారే మంత్రులయ్యారు. షామూన్ రెండవసారి అధ్యక్షుడుగా ఎన్నుకోబడ్డాడు. అమెరికావారి అభీష్టం నెరవేరింది.

6

బ్రిటన్ యిక చేయగలిగింది లేక, పశ్చిమ ఆసియాను కొల్లగొట్టుకొనేందుకు అమెరికాతో జత కలవవలసివచ్చింది; ఏకఛత్రాధిపత్యం వహించడం యిక సాధ్యపడదని తెలుసుకొని, పశ్చిమ ఆసియాలోని నూనె గనులమీద అమెరికాకు కూడా పెత్తనం యివ్వవలసివచ్చింది.

బ్రిటన్‌యొక్క పరిస్థితిని చక్కగా అర్థంచేసుకున్న అమెరికా యీ అవకాశాన్ని చాకచక్యంతో వినియోగించుకొంది. క్రమక్రమంగా పశ్చిమ ఆసియా నూనె గనుల మీద ఆధిపత్యం సంపాదించి, బ్రిటన్‌ని చిన్న భాగస్వామిగా మార్చివేసింది. మూడు ప్రధానమైన రాక్ఫెల్లర్ కంపెనీలు— స్టాండర్డ్ ఆయిల్ కంపెనీ (న్యూజెర్సీ), సోకొనీ మోబిలాయిల్ (కాలిఫోర్నియా), స్టాండర్డు ఆయిల్ (కాలిఫోర్నియా) — సౌదీఅరేబియా నూనె ఉత్పత్తిలో 100 కి 70 వంతులు, బహరీన్ ఉత్పత్తిలో 100 కి 50 వంతులు, ఇరాక్ ఇరాన్ ఉత్పత్తిలో 20 వంతులు—తమ గుప్పెట్లో పెట్టుకొన్నాయి. పెర్షియన్ జలసంధి ప్రాంతంలో ఉన్న అమెరికా పెట్టుబడులనుకూడా యీ మూడు కంపెనీలే కంట్రోలు చేస్తున్నాయి. 1955 నాటికే వాటి పెట్టుబడి 130 కోట్ల డాలర్లవరకు ఉంది. క్రిందటి సంవత్సరం పశ్చిమ ఆసియా నూనె గనుల్లో మొత్తం 17 కోట్ల 68 లక్షల టన్నుల నూనె ఉత్పత్తి అయితే, అందులో 5 కోట్ల టన్నులు రాక్ఫె

ల్లర్ కంపెనీలది. ఏటా అవి సంపాదించే లాభాలు 50 కోట్ల డాలర్లు. ఇంకా యెక్కువ లాభాలు సంపాదించేందుకు యీ కంపెనీల అధిపతులు ప్రభుత్వాధినేతలనుకూడా జతకలుపుకున్నారు. ఉదాహరణకు, అమెరికా విదేశాంగమంత్రి డల్లెస్ రాక్ఫెల్లర్స్‌తో దగ్గర సంబంధాలు కలిగియున్నాడు. ప్రభుత్వ యంత్రంలో అతడు వారి ప్రతినిధి. న్యూజెర్సీ స్టాండర్డ్ ఆయిల్ అను రాక్ఫెల్లర్ కంపెనీ డైరెక్టర్స్‌లో డల్లెస్ ఒకడు. చాలకాలం అతడు రాక్ఫెల్లర్ నిధి అను సంస్థకు అధ్యక్షుడుగా పనిచేశాడు. అమెరికా విదేశాంగ విధానం ఎప్పుడూ స్టాండర్డ్ ఆయిల్ కంపెనీ ప్రయోజనాల కనుగుణ్యంగానే ఉంటుంది.

రెండోవైపున, యీ దోపిడీని శాశ్వతంగా కొనసాగించుకొనేందుకు, తమ దురాక్రమణ పథకాల్లో అరబ్బు దేశాలను సాధనాలుగా ఉపయోగించుకొనేందుకు అమెరికా ఒక సైనిక కూటమిని నిర్మించదలచుకొంది. అంటే ఒక కొత్త రకపు వలస రాజ్యాధిపత్యం పశ్చిమ ఆసియాలో స్థాపించదలచుకొంది.

ఇందుకోసం డల్లెస్ 1953 లో పశ్చిమ ఆసియా దేశాలన్నీ పర్యటించాడు. అతని ఉద్దేశం టర్కీ, పాకిస్తాన్, ఇరాన్, ఇరాక్ దేశాలతో ఒక "రక్షణ" కూటమిని నిర్మించడం; దాన్ని సోవియట్ వ్యతిరేక యుద్ధస్థావరంగా ఉపయోగించుకోడం. ఈ కూటమిలో ప్రత్యక్షంగా చేరేందుకు అమెరికా ఉత్సాహపడలేదు. అలాచేరితే అరబ్బుదేశాలు ఎదురు తిరుగుతాయని అమెరికా భయపడింది. బ్రిటన్‌కి మాత్రం

అందులో సభ్యత్వం యిచ్చి, ఆ కూటమికి బాగ్దాద్ రక్షణ కూటమి అని పేరుపెట్టింది. ఈపథకంఫలిస్తే దీని కవసరమయే ఆర్థిక సహాయం కొరకు బ్రిటన్ తన కాళ్ళమీద పడవలసి వస్తుందనీ, ఫలించకపోతే ఆ నష్టాన్ని బ్రిటనే భరించుకోవలసి వస్తుందనీ అమెరికా ఆలోచన!

కాని బ్రిటన్ వేరొక ఉద్దేశంతో అమెరికా పథకాన్ని బలపరిచింది. ఇరాన్‌లో తనకుగల నూనెగనులను స్వాధీనం చేసుకున్న ముసాదిక్ (ఇరాన్ ప్రధాని) ఉదంతం పెను భూతంలా బ్రిటన్‌ని రాత్రింబగళ్లు వెన్నంటుతూంది! ఇతర ప్రాంతాల్లోని నూనెగనులను కూడా ఒదులుకోవలసి వస్తుం దేమోనని బ్రిటిష్‌వారు భయపడ్డారు. పశ్చిమ ఆసియాలో తమ స్థానాన్ని పదిలంగా కాపాడుకోడానికి బాగ్దాద్‌కూటమి ఎంతో అవసరమని వారు భావించారు.

కాని త్వరలోనే వారి ఆశలు అడియాస లయాయి. ఈజిప్టు, సిరియా, లెబనాన్, సౌదీఅరేబియా, జోర్డాన్ దేశాలు బాగ్దాద్ కూటమిలో చేరడానికి నిరాకరించాయి. 1955 చివరి భాగంలో బ్రిటన్ బలవంతంగా జోర్డాన్‌ని యీ కూటమిలో యిరికించడానికి ప్రయత్నించగా, జోర్డాన్ ప్రజలు బ్రహ్మాండమైన ప్రతిఘటనోద్యమం ప్రారంభించారు. పాత ప్రభుత్వం స్థానే కొత్త ప్రభుత్వాన్నెన్నుకొని, బ్రిటిష్ సైన్యాధికారి అయిన గ్లబ్ పాషాను దేశంనుంచి తరిమివేశారు. బాగ్దాద్ కూటమికి అది మొదటి దెబ్బ. 1956 లో బ్రిటన్ - ఫ్రాన్స్‌లు ఈజిప్టుపై దాడిచేసినప్పుడు బాగ్దాద్ కూటమికి చెందిన ఏ రాజ్యమూ తనకు సహాయం చేయకపోగా ఇరాన్, పాకి

స్తాన్, ఇరాక్ ప్రభుత్వాలు ప్రజల ఒత్తిడికి తట్టుకోలేక బ్రిటన్ - ఫ్రాన్స్‌ల దురాక్రమణను ఖండించాయి. దురాక్రమణ దారులు తోకముడవవలసి వచ్చింది. ఇది బాగ్దాద్ కూటమికి రెండవ దెబ్బ. అరబ్బు దేశాలను సోషలిస్టు శిబిరంనుంచి వేరు చేసేందుకు, అరబ్బు ప్రజల స్వాతంత్ర్యోద్యమాలను అణచి వేసేందుకు ఐసెన్‌హోవర్ సిద్ధాంతం (ఐక్ పశ్చిమ ఆసియా పథకం) అనేపేరుతో అమెరికా మరోప్లాను తయారు చేసింది. దాన్ని ఇరాన్, లెబనాన్, సౌదీ అరేబియా దేశాలు బలపరిచి నప్పటికీ, జోర్డాన్ ప్రభుత్వం బలప్రయోగంద్వారా కూల ద్రోయబడినప్పటికీ, సిరియామీద సాయుధదాడి జరపడానికి అమెరికా చేసిన ప్రయత్నం భగ్నమవడమేకాక, ఆ దేశ ప్రభుత్వాన్ని కూలద్రోసేందుకు జరిగిన కుట్రలు పటాపంచలు చేయబడ్డాయి; ఈజిప్టులోకూడ యిలాంటిదే మరోకుట్ర భగ్నం చేయబడింది. ఈజిప్టు సిరియాలు ఐక్య అరబ్బు రిపబ్లిక్‌గా ఏర్పడి, అరబ్బుప్రజల స్వాతంత్ర్యాన్ని రక్షించే బాధ్యతను తీసుకొన్నాయి. యెమెన్‌కూడ ఐక్య అరబ్బు రిపబ్లిక్‌లో చేరింది. ఈ విధంగా అరబ్బు ప్రజలు అనేక శతాబ్దాలుగా కలలుకంటూ వచ్చిన ఐక్య అరబ్బు రిపబ్లిక్ స్వాతంత్ర్యోద్యమ మహావెల్లువలో అవతరించి, సామ్రాజ్యవాదుల గుండెలో బల్లెంగా తయారైంది. ఇది బాగ్దాద్‌కూటమికి మూడవ దెబ్బ.

31

7

బాగ్దాద్‌కూటమిలో చేరకుండా తటస్థంగాఉన్న లెబనాన్‌ని లొంగదీసుకోడానికి సామ్రాజ్యవాదులు సకల ప్రయత్నాలు చేశారు. 1956 మార్చిలో తన ఆరవ నౌకాదళానికి చెందిన యుద్ధనౌకలను అమెరికా బీరూట్ రేవులో దింపింది. తర్వాత బ్రిటిష్‌నౌకలు చేరుకున్నాయి. మొత్తం 10 డెస్ట్రాయర్లు, ఒక క్రూయిజరు, ఒక విమాన వాహకనౌక, రెండు జలాంతర్గాములు బీరూట్ రేవులో ప్రవేశించాయి. బ్రిటన్, అమెరికాలు అరబ్బు దేశాల్లో బలప్రదర్శనం చేయదలచుకున్నాయనీ, అందుకనే యుద్ధనౌకలు పంపబడ్డాయనీ అమెరికా పత్రికలు వ్యాఖ్యానించాయి.

నూనె రవాణా విషయంలో లెబనీస్ ప్రభుత్వానికి, ఇరాక్ పెట్రోలియం కంపెనీకి మధ్య 1956 లో ఒక తగాదా బయల్దేరింది. అది చాల మాసాలు కొనసాగింది.

బ్రిటన్ అమెరికాల పెత్తనంక్రిందవున్న యీ కంపెనీ ఇరాక్‌నుండి అంతకంతకు అధికంగా నూనెను రవాణాచేస్తూ వచ్చింది. 1949 లో 40 లక్షల టన్నులు రవాణా అయితే, 1951లో 83 లక్షల టన్నులు, 1952 లో 180 లక్షల టన్నులు రవాణా చేయబడింది. ఇరాక్‌నూనెను సరాసరి పెర్షియన్ జలసంధిగుండా యూరపుకు రవాణాచేస్తే ఒక్కొక్క పీపాకు 45 సెంట్లు (100 సెంట్లు 1 డాలరు)ఖర్చు అవుతుంది. దాన్నే పైప్‌లైన్లగుండా సిరియా, లెబనాన్‌ల మీదుగా మధ్యధరా

సముద్రానికి చేర్చి అక్కడనుంచి యూరపియన్ దేశాలకు రవాణాచేస్తే 18 సెంట్లే ఖర్చవుతుంది. అంటే ఒక్కొక్కపీపా మీద 27 సెంట్లు లాభం వస్తుందన్నమాట. 1955 లో ఇరాక్ పెట్రోలియం కంపెనీ యిట్టి పైప్ లైన్లగుండా ఎగుమతిచేసిన 3 కోట్ల టన్నుల నూనెమీద దాదాపు 6 కోట్ల డాలర్లు లాభం వచ్చింది. ఈ లాభంలో కొంతభాగం తమ కీయవలసిందని సిరియా, లెబనాన్‌లు సహజంగా కోరాయి. ఈసమస్యపై ఇరాక్ పెట్రోలియం కంపెనీకి, లెబనాన్ ప్రభుత్వానికి మధ్య ఒక ఒడంబడిక జరిగింది. దీనిప్రకారం, లెబనాన్‌కి రావలసిన అదనపురాబడి ఎంతో లెక్కకట్టేటప్పుడు నూనె యొక్క బరువును, పైప్‌లైన్‌యొక్క పొడవును కూడా దృష్టిలో ఉంచుకుంటారు; కాని నూనెబరువుకన్న పైప్‌లైన్ పొడవుకు ఎక్కువ ప్రాధాన్యమిస్తారు. లెబనాన్ భూభాగంగుండా 32 కిలోమీటర్ల(1 కిలోమీటరు 5 ఫర్లాంగులతో సమానం)పైప్‌లైన్ మాత్రమే వెళ్తుంది. అందుచేత 40 లక్షల లెబనీస్ పౌనులుమాత్రమే లెబనాన్‌కిలభిస్తాయి. తత్ఫలితంగా లెబనాన్ ప్రజలు, ప్రభుత్వం తమకు న్యాయంగా రావలసిన భాగం రానందుకు అసంతృప్తిచెందారు. సామ్రాజ్యవాదుల పెత్తనం క్రింద ఉన్న ఇరాక్ పెట్రోలియంకంపెనీ లెబనాన్ కోర్కెను అంగీకరించలేదు. బాగ్దాద్ సైనికకూటమిలో లెబనాన్‌ని చేర్చేటందుకు బ్రిటన్, అమెరికాలు పన్నిన పన్నాగమిది. లెబనాన్ తమ షరతుల కంగీకరించకపోతే ఇరాక్ పెట్రోలియం కంపెనీ తన పైప్‌లైన్లను లెబనాన్‌గుండా కాక సిరియాగుండా తీసుకెళ్లి మధ్యధరా సముద్రానికి చేరుస్తుందని

బ్రిటన్ - అమెరికాలు బెదిరించాయి. లెబనాన్ ప్రభుత్వం యీ బెదరింపులకు లొంగలేదు. విదేశీ కంపెనీలమీద విధించవలసిన పన్నురేట్ల విషయమై పార్లమెంటు ఆమోదించిన చట్టాన్ని ప్రభుత్వం జూన్ 29 వ తేదీని (1956) ధృవపరుస్తూ ఉత్తరువు జారీచేసింది. అంతకుపూర్వం ఇరాన్ పెట్రోలియం కంపెనీ లెబనాన్‌కి ఆదాయపు పన్నుగాని, దిగుమతి పన్నుగాని చెల్లించేదికాదు. అందువల్ల ప్రభుత్వానికి బోలెడు ఆదాయం నష్టం వచ్చేది. కాని పైప్‌లైన్లుపడ్డాక ఆ కంపెనీ లాభాలరూపంలో బోలెడు ఆదాయం సంపాదిస్తూ వచ్చింది. కాని అందులో లెబనాన్‌కి న్యాయంగా యివ్వవలసినభాగం యివ్వడానికి నిరాకరించింది. ఈ విధానాన్ని లెబనాన్ ప్రభుత్వం ఎదుర్కొన్నందుకు యావన్మంది ప్రజలు హర్షించారు. అంతేకాదు. ఇరాన్ పెట్రోలియం కంపెనీ తన బెదరింపును అమలు జరిపినట్లయితే - అనగా లెబనాన్ భూభాగం గుండా వెళ్ళే పైప్‌లైన్‌ను ఉపయోగించడం మానివేసినట్లయితే - ప్రభుత్వం ఆ పైప్‌లైన్లనూ, ట్రిపోలిలోని నూనె శుద్ధి కర్మాగారాన్నీ, తదితర నిర్మాణాలనూ వశపరచుకొంటుందని హెచ్చరించింది.

ఈ హెచ్చరికను సామ్రాజ్యవాదులు లెక్కచేయలేదు. లెబనాన్ ప్రభుత్వంమీద వారు విపరీతమైన ఒత్తిడి తీసుకొచ్చారు. చివరకు ఐసెన్‌హోవర్ సిద్ధాంతాన్ని లెబనాన్‌చేత అంగీకరింపజేశారు. అప్పటినుంచీ లెబనాన్ తటస్థవిధానానికి స్వస్తి చెప్పింది; పంచశీల సూత్రాలను గాలికి విడిచిపెట్టి, సామ్రాజ్యవాదుల అడుగులకు మడుగులొత్తే

విధాన మవలంబించసాగింది. దీన్నిబట్టి తటస్థరాజ్యాలపై సామ్రాజ్యవాదు లెంత బలమైన ఒత్తిడి తేగలరో, వారి వలలో పడకుండా తటస్థరాజ్యా లెంత అప్రమత్తతతో మెల గాలో అర్థమవుతుంది. ఎప్పుడైతే లెబనాన్ పాలకులు ఐసెన్‌హోవర్ సిద్ధాంతాన్ని అంగీకరించారో అప్పుడే వారు సామ్రాజ్యవాదుల చేతిలో కీలుబొమ్మలుగా తయారయారు. నాటినుంచీ ఆంగ్లో-అమెరికన్ సామ్రాజ్యవాదులు ఈజిప్టు-సిరియా దేశాలపై ప్రారంభించిన కుట్ర లన్నిటికీ లెబనాన్ కేంద్రంగా తయారైంది.

ఈ విధానం లెబనాన్ ప్రజల్లో తీవ్రమైన ఆగ్రహం కలిగించింది. ఈ విషయం 1957 లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో స్పష్టమైంది. అమెరికా ప్రభుత్వం బీరూట్ హార్బర్‌లో యుద్ధనావలను ప్రవేశపెట్టి భయోత్పాతం కలిగించజూచింది. ప్రభుత్వం అన్నిరకాల మోసాలకు ఒడిగట్టింది. నిరాయుధులైన ప్రజలమీద పోలీసులు హింసాకాండ జరిపారు. అనేకచోట్ల పోలీసులకు, ప్రజలకుమధ్య ఘర్షణలు జరిగాయి. ప్రభుత్వ అనుకూలురు ఎన్నికైనట్లు ప్రకటింపబడింది.

క్రమంగా ప్రజల్లో ఉద్రిక్తత హెచ్చింది. ఏ నిమిషాన తిరుగుబాటు వస్తుందో చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. ఇంతలో 'టెలిగ్రాఫ్' అను పత్రికకు ప్రధాన సంపాదకుడైన నాసిబ్ మెట్నీ దారుణంగా హత్యచేయబడ్డాడు. అతడు లెబనాన్ ప్రజల స్వాతంత్ర్యవాంఛను బలపరుస్తూ వచ్చాడు. ఆయన మృత కళేబరాన్ని సందర్శించేందుకు స్మశానానికి వచ్చిన

వేలాది ప్రజలు సామ్రాజ్యవాదుల పైశాచిక చర్యలను గొంతెత్తి నిరసించారు.

షామూన్ ప్రభుత్వం దేశంలో "శాంతి భద్రతలను" నెలకొల్పేందుకు 1958 మే మాసంలో ప్రజలమీదికి సాయుధ పోలీసుల్ని పంపింది. ప్రజలు ఆత్మరక్షణకై ఆయుధాలను చేబట్టారు. కార్మికులు దేశవ్యాపిత సమ్మె జరిపారు. అనేక పట్టణాల్లో వీధిపోరాటాలు ప్రారంభమయాయి. తిరుగుబాటు దార్లు ట్రిపోలి నగరాన్ని ఆక్రమించుకున్నారు.

పరిస్థితి చేయిజారిపోతూందని గ్రహించి, ప్రభుత్వం అమెరికాను సైనికసహాయం కోరింది. తమ చర్యను సమర్థించుకోడానికి ఐక్య అరబ్బు రిపబ్లిక్ (ఈజిప్టు, సి రి యా, యెమెన్) యీ తిరుగుబాటును ప్రోత్సహించిందని బుకాయించింది. వెంటనే- అనగా మే 15 వ తేదీని - వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంస్థలు, ప్రముఖవ్యక్తులు యీ ఆరోపణను ఖండిస్తూ ఒక సంయుక్త ప్రకటన చేశారు. అందులో వారిలా స్పష్టం చేశారు :

" దేశవ్యాపితంగా జరుగుతూన్న యీ తిరుగుబాటు ప్రజల తిరుగుబాటు. దాని ఉద్దేశమల్లా దేశస్వాతంత్ర్యాన్ని రక్షించుకొని పటిష్ఠమొనర్చడం, ప్రజలందరూ సమానంగాను, సోదరభావంతోను, ధర్మచింతనతోను జీవించడానికవసరమైన పరిస్థితులను కల్పించడం."

ఈ ప్రకటనమీద సంతకాలు చేసిన సంస్థలు నేషనల్ ఆర్గనైజేషన్ పార్టీ, నజాడిస్టులు, సోషలిస్టు ప్రోగ్రెసివ్ పార్టీ,

కాన్‌స్టిట్యూష‌నల్ యూనియన్ పార్టీ. వీటిలో చివరిది పెద్ద పెట్టుబడిదారుల సంస్థ.

మరునాడు - అంటే మే 16 న - లెబనాన్ ప్రజల స్వాతంత్రోద్యమాన్ని అణచేటందుకు అమెరికా ఆయుధాలను పంపింది. తర్వాత యుద్ధనౌకలు, విమానాలు పంపేటందుకు ఉత్తరువులు జారీ చేసింది. రెండోవైపున భద్రతాసమితిలో లెబనాన్ ప్రతినిధి తమ దేశంపై ఐక్య అరబ్బు రిపబ్లిక్ దురాక్రమణ జరిపిందంటూ చేసిన ఫిర్యాదును అమెరికా ప్రతినిధి బలపరిచాడు.

ఈ సందర్భంలో మన మొక విషయం గమనించాలి. లెబనాన్ ఘటనలకు కొద్దిరోజులు ముందు అమెరికా ప్రభుత్వం అధికారయుతంగా ఒక ప్రకటన చేసింది. అందులో, ఐక్య అరబ్బు రిపబ్లిక్ యెడల తన విధానాన్ని మార్చుకో దలచినట్లు తెలిపింది. అంటే, ఈజిప్టుపై ఆర్థిక దిగ్బంధాన్ని తొలగించి ఆ దేశంతో మామూలు సంబంధా లుంచుకొనేందుకు సంసిద్ధత ప్రకటించింది. దీనికీ, లెబనాన్ చేసిన ఫిర్యాదును సమర్థిస్తూ అమెరికా ప్రతినిధి చెప్పినమాటలకూ పొత్తు కనిపించదు. ఒకటిమాత్రం దీన్నిబట్టి స్పష్టమైంది : ఇకమీదట తాము ఈజిప్టు యెడల స్నేహభావం ప్రదర్శిస్తామనే దొంగ మాటలతో అరబ్బుప్రజల్ని నమ్మించి, తమ దురాక్రమణపట్ల అజాగ్రత్తగా ఉండేటట్లు చేయడమే అమెరికన్ సామ్రాజ్య వాదుల ఉద్దేశం !

37

8

లండన్‌నుంచి ప్రచురింపబడే 'న్యూస్ క్రానికల్' పత్రిక జూన్ 13 వ తేదీ (1958) సంచికలో ఒక రహస్యాన్ని బయటపెట్టింది. అమెరికా బ్రిటన్‌లు చాలకాలం నుంచీ పశ్చిమ ఆశియాలో దురాక్రమణ జరపడానికొక ప్లానును తయారుచేసినట్లు, దానిని ఉభయ ప్రభుత్వాలూ అధికార యుతంగా ధృవపరచినట్లు ఆ పత్రిక వ్రాసింది. వారి ప్లాను ప్రకారం అమెరికా లెబనాన్ రేవుపట్టణమైన బీరూట్‌లో 3000 మంది సాయుధ సైనికుల్ని సమీకరించాలి. రెండో వైపున బ్రిటిష్, అమెరికన్ గాలిగుమ్మటదళాలు దక్షిణ లెబనాన్‌ని ఆక్రమించుకుంటాయి. సైప్రస్‌లో కేంద్రీకరింపబడ్డ సాయుధబలాలన్నీ లెబనాన్‌లో జోక్యం కలిగించుకోడానికే ఉద్దేశింపబడ్డాయని 'న్యూస్ క్రానికల్' తెలియజేసింది.

ఈవిధంగా, పశ్చిమ ఆసియాపై దురాక్రమణ చేయడానికి ఆంగ్లో-అమెరికన్ సామ్రాజ్యవాదులు చాలకాలం నుంచీ సన్నాహాలు జరుపుతూవచ్చారు. సాకుకోసంమాత్రమే వారు ఎదురుచూచారు. త్వరలోనే ఆ సాకు దొరికింది. ఐక్య అరబ్బు రిపబ్లిక్ తన దేశవ్యవహారాల్లో జోక్యం కలిగించు కొంటూందని లెబనాన్ ప్రభుత్వం వట్టి అభూతకల్పనలతో భద్రతా సమితికి ఫిర్యాదుచేసింది.

లెబనీస్ ప్రతినిధి తన ఆరోపణను రుజువు చేసుకోనేందుకు భద్రతాసమితిలో ఒక్క ఆధారమైనా చూపలేక పోయాడు. పైగా ఐక్య అరబ్బు రిపబ్లిక్ ప్రతినిధి ఎంతో సమర్థవంతంగా లెబనాన్ ఆరోపణ అభూతకల్పన అని రుజువు చేశాడు. అమెరికా ప్రతినిధి డల్లెస్ లెబనాన్ ప్రభుత్వానికి సహాయం చేయవలసి యుంటుందని ప్రతిపాదించాడు. స్వీడన్ ప్రతినిధి వెంటనే ఒక పరిశీలకబృందాన్ని లెబనాన్-సిరియా సరిహద్దుకు పంపాలని సూచించాడు. ఈ ప్రతిపాదనను సోవియట్ ప్రతినిధి వీటో చేస్తాడని ఊహించి, డల్లెస్ తన ఆమోదం తెలియజేశాడు. (అలా వీటో చేస్తే ఐ. రా. స. నిబంధనావళి ప్రకారం సర్వ ప్రతినిధి సభను పిలవవలసి యుంటుంది. అక్కడ అమెరికా తనకుగల మెజారిటీతో ఏ తీర్మానాన్నైనా ప్యాసు చేయించుకోవచ్చు). కాని సోవియట్ ప్రతినిధి వీటో చేయలేదు; తటస్థంగా ఉన్నాడు. స్వీడిష్ ప్రతినిధి తీర్మానం ఆమోదింపబడింది. అమెరికా కూడ దానికి కట్టుబడవలసి వచ్చింది. ప్యాసైన తీర్మానం ప్రకారం ఐ. రా. స. ప్రధాన కార్యదర్శి హామర్షెల్డ్ నాయకత్వాన ఒక పరిశీలక బృందం (ఇందులో భారత ప్రతినిధి డాక్టర్ రాజేశ్వరదయాళ్ కూడా ఉన్నారు) లెబనాన్ సందర్శించింది. అక్కడి పరిస్థితిని కూలంకషంగా పరిశీలించి, జూలై మొదటివారంలో ఐ. రా. స. కు ఒక నివేదికను సమర్పించింది. అందులో వారు విదేశీ ఆయుధాలు కనబడ్డప్పటికీ లెబనాన్‌లో ఐక్య అరబ్బు రిపబ్లిక్ (ఈజిప్ట్ - సిరియా) జోక్యం కల్పించుకున్నట్లు దాఖలా ఎక్కడా లేదన్నారు.

దీనితో, బ్రిటన్ - అమెరికాల ఆశలు అడియాసలయాయి. ఇంతకాలంనుంచీ ఏదో ఒక సాకు కోసం ఎదురుచూస్తున్న ఆంగ్లో-అమెరికన్ సామ్రాజ్యవాదుల అభీష్టం యీడేర లేదు.

కాని వారంత సులభంగా ఓటమిని అంగీకరిస్తారా? అది వారి ప్రకృతికే విరుద్ధం! ఒక ఎత్తు పారకపోతే యింకొక ఎత్తు; అదీ లాభం లేకపోతే మరొకటి! లెబనాన్ తిరుగుబాటును సోవియట్ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందనీ, తద్వారా పశ్చిమ ఆసియాను స్వాధీన పరచుకోవాలని యత్నిస్తూందనీ సామ్రాజ్యవాదులు ప్రచారం ప్రారంభించారు. దీనికి సమాధానంగా లెబనాన్ పార్లమెంటు సభ్యుడు హాద్ చెప్పినమాటలు గమనార్హం. ఆయన యిలా అన్నాడు:

"మా సంపదనంతా కొల్లగొట్టుకొని, మా అరబ్బు రాజ్యాలమధ్య చీలికలుపెట్టడానికి ప్రయత్నిస్తూ, మాస్వాతంత్ర్యాన్ని హరిస్తూన్నది కమ్యూనిస్టు దేశమా? సోవియట్ యూనియనే గనుక మా పొరుగున లేకపోయినట్లయితే, ఒక్క స్వతంత్ర అరబ్ దేశంకూడా మనగలిగేదికాదు. ఆ కమ్యూనిస్టు మహాదేశం మా సరసన ఉన్నందుకు భగవంతునికి వేయి దండాలు!"

లెబనాన్‌లో ప్రజాపోరాటం ప్రారంభమై రెండు నెలలు గడిచింది. జూన్ 26వ తేదీని వెలువడ్డ అసోసియేటెడ్ ప్రెస్ ఆఫ్ అమెరికా కథనం ప్రకారం దాదాపు 4000 చదరపుమైళ్ళ విస్తీర్ణంగల భూభాగంలో అనేక ప్రాంతాలు తిరుగుబాటు

దారులవశమయాయి. ఈమధ్య ఉత్తర లెబనాన్‌లో హాల్బాను ప్రభుత్వసేనలు ఖాళీచేయనలసి వచ్చింది. దీని ఫలితంగా ఉత్తర లెబనాన్ అంతా విప్లవకారులకు చేజిక్కింది. ఆ కథనంలో ఇంకా యిలా ఉంది :

"ఉత్తర లెబనాన్‌లో అధిక ప్రాంతం దట్టమైన అడవులతోను, పర్వతాలతోను నిండియున్నందున గెరిల్లా దళాలకు ఆ ప్రాంతం ఎంతో అనుకూలంగా ఉంది. చకచక పర్వతాలను ఎక్కగల, దిగగల గెరిల్లాలు చిన్న చిన్న ఆయుధాలు పుచ్చుకొని జరిపే పోరాటం ఆధునిక టాంకులు, విమానాలు, మర ఫిరంగులు మొదలైన వాటితో చేసే పోరాటంకన్న చక్కని ఫలితాల నిస్తుంది.

"ట్రిపోలీ రేవు పట్టణానికి సమీపంలో ఉండే ప్రాంతాల్లో తిరుగుబాటుదార్లు మాజీ ప్రధాని రషీద్ కరామీ నాయకత్వంక్రింద పోరాడుతున్నారు. తూర్పున హెర్మెల్ ప్రాంతంలో షిబ్లీ అర్యన్ అను డ్రూజ్ జాతి నాయకుణ్ణి అనుసరిస్తున్నారు.

"తూర్పు లెబనాన్‌లోని బెకా నదీలోయలోని ఉత్తరప్రాంతం ప్రధానంగా పార్లమెంటు మాజీ స్పీకరు సబ్రీ హామాదె నాయకత్వాన పోరాడేవారి చేతిలో ఉంది.

"ఇంకా దక్షిణాన పర్వతపంక్తులున్న ప్రాంతం ఉంది. అక్కడ మాజీ ఆర్థిక మంత్రి జంబ్లాట్ (సోషలిస్టు) తిరుగుబాటును నడుపుతున్నాడు......

"ఇక్కడికి దక్షిణ దిశగాను, లోతట్టు ప్రాంతంలోను జరిగే పోరాటానికి నాయకుడు అహమ్మద్ అస్సాద్. ఇతడుకూడా పార్లమెంటు మాజీ స్పీకరే......

"ప్రభుత్వసేనలు ప్రధానమైనకోస్తా రోడ్లమీద, బీరూట్-డెమాస్కస్ ట్రంకురోడ్డు మీద (సిరియా సరిహద్దువరకు) కేంద్రీకరింపబడియున్నాయి. బీరూట్, సిడోన్, ట్రిపోలీ నగరాలు కూడ ప్రభుత్వసేనల వశంలోనే ఉన్నాయి. కాని ప్రతి నగరంలోనూ తిరుగుబాటుదార్లు

కొన్ని రహస్య ప్రదేశాలను కేంద్రాలుగా చేసుకొని అక్కడ ఏకఛత్రాధి పత్యం వహిస్తున్నారు."

దేశ ప్రజలంతా షామూన్ ప్రభుత్వం రాజీనామా యివ్వాలని కోరుతున్నారు. కాని అతడందుకు సిద్ధంగా లేడు. లెబనాన్ రాజ్యాంగం ప్రకారం ఒకే వ్యక్తి రెండుసార్లు అధ్యక్షుడుగా ఉండరాదు. షామూన్ రెండుసార్లు అధ్యక్షుడుగా ఉన్నాడు. అతని గడువు 1958 సెప్టెంబరులో పూర్తి అవుతుంది. కాని మరికొన్నాళ్లు గద్దె నలంకరించాలన్న ఉద్దేశంతో అతడు తన కనుకూలంగా రాజ్యాంగాన్ని మార్చ ప్రయత్నించాడు. ప్రజలు, ప్రతిపక్షాలు దాన్ని తిరస్కరించారు. ఈనెల (జూలై) 24 వ తేదీని ఎన్నికలు జరగవలసి యుంది. కాని ప్రజల తీర్పు ఎలావుంటుందో ముందే ఊహించుకుని, కాలనిర్ణయం లేకుండా ఎన్నికలను వాయిదా వేస్తూ ప్రధాని సామీసోల్ ఒక ప్రకటన చేశాడు.

పరిస్థితులిలాఉండగా, జూలై 14వ తేదీని సామ్రాజ్య వాదులకుపట్టుగొమ్మ, బాగ్దాద్ కూటమికి జీవనాడి అనదగ్గ ఇరాక్‌లో అకస్మాత్తుగా విప్లవం వచ్చింది. సైనికాధికారులు ఇరాక్ ప్రధాని నూరీ అల్‌సయీద్‌ని, రాజుయొక్క పినతండ్రి అబ్దుల్ ఇలాహ్‌ని వధించి, అధికారాన్ని హస్తగతం చేసుకున్నారు. రాచరికానికి స్వస్తిచెప్పి, ఇరాక్‌ని రిపబ్లిక్‌గా ప్రకటించారు. సామ్రాజ్యవాదుల ప్రోత్సాహంతో 1958 ఫిబ్రవరిలో రూపొందిపబడిన ఇరాక్ - జోర్డాన్ సమాఖ్య నుండి ఇరాక్ రిపబ్లిక్ విడివడింది. అలాగే బాగ్దాద్‌కూటమికి కూడా ఇరాక్ స్వస్తి చెప్పింది.

ఈ వార్త బ్రిటిష్ - అమెరికన్ దురాక్రమణదారుల చెవిని పడిందో లేదో - లెబనాన్ కూడా ఇరాక్ మాదిరిగా చెయ్యిజారిపోతుందని గాభరా పడ్డారు. హుటాహుటీగా అమెరికా నౌకా సైనికబలాలను లెబనాన్ మీాదికి ఉరికించి దేశాన్ని ఆక్రమించుకున్నారు. వేలాది బ్రిటిష్ - అమెరికన్ సైనికుల ఆక్రమణక్రింద నేడు లెబనాన్ ఉంది. ఈదురాక్రమణను సమర్థించుకొనేందుకు సామ్రాజ్యవాదులు ఒక ఎత్తు ఎత్తారు. లెబనీస్ తిరుగుబాటుకు సోవియట్ ప్రోత్సాహం ఉందన్నారు. శాంతిభద్రతలను కాపాడ్డంలో సహాయపడవలసిందని లెబనాన్ అధ్యక్షుడు షామూన్ చేసిన విజ్ఞప్తిని పురస్కరించుకొని తాము యీ "ధర్మకార్యానికి" పూనుకొన్నామన్నారు.

వెంటనే లెబనాన్ పార్లమెంటులో ప్రతిపక్ష నాయకుడు సయిద్ సాలం ఒక ప్రకటన చేస్తూ, లెబనాన్‌లో అమెరికా సేనలు దిగడం అంతర్జాతీయ న్యాయశాస్త్రాన్ని దారుణంగా ఉల్లంఘించడమే నన్నాడు. అమెరికా దురాక్రమణను తాము అడుగడుగునా ప్రతిఘటించి తీరుతామన్నాడు.

అనేకమంది లెబనీస్ ప్రముఖులు యిలాంటి ప్రకటనలే చేశారు.

లెబనాన్‌ని ఆక్రమించుకోడంతోనే సంతృప్తిచెందక, జోర్డాన్‌ని కూడా సామ్రాజ్యవాదులు తమ సైనిక బలంతో ఆక్రమించుకున్నారు.

ఈ విధంగా బ్రిటన్ - అమెరికాలు పశ్చిమ ఆసియా ప్రజల స్వాతంత్ర్యోద్యమాలను అణచేటందుకు సాయుధ బలాన్ని ఉపయోగిస్తున్నారు.

వారి అసలు ఉద్దేశం అందరికీ తెలుసు. పశ్చిమ ఆసియా రాజ్యాలు స్వతంత్ర రాజ్యాలుగా అవతరిస్తే, ఆ దేశాల్లోని నూనె గనులమీద లాభాల రూపంలో బ్రిటన్ అమెరికా దేశాలు సంపాదిస్తున్న కోటానుకోట్ల డాలర్లు పశ్చిమ ఆశియా దేశాలకే ఉంటాయి. సామ్రాజ్యవాదుల చేతికి చిప్ప వస్తుంది! ఇదీ అసలు రహస్యం.

ఈ రోజున బ్రిటిష్, అమెరికన్ సేనలు వేలసంఖ్యలో లెబనాన్‌ని ఆక్రమించుకోవచ్చు; జోర్డాన్‌ని ముట్టడించవచ్చు. కాని పశ్చిమ ఆసియాలో సామ్రాజ్యవాదుల పెత్తనానికి యివి ఆఖరు ఘడియలు. టాంకులు, మరఫిరంగులు, అణ్వాయుధాలు సామ్రాజ్యవాదుల బలాన్ని సూచించవు. 1952 నుంచీ అరబ్బురాజ్యాలను తమపిడికిట్లో ఉంచుకోనేందుకు వారు తయారుచేసిన పథకాలన్నీ ఒక్కొక్కటే భగ్నమయాయి. ఇక మిగిలిన ఆయుధం సాయుధజోక్యం. ఈఆయుధాన్నికూడా పశ్చిమఆసియా ప్రజలు పటాపంచలు చేయగలరు. ఆసియా ప్రజల అండ వారికుంది. సోషలిస్టుదేశాలు వారికి బాసటగా నిలుస్తాయి. యావత్ప్రపంచంలోని శాంతికాముకులు స్వాతంత్ర్యప్రియులు వారికి మిత్రులు.

★

44

46

Check List			
Book Number	PS010598	Date	22/11/22
Front Cover	yes	Back Cover	yes
Blank Pages	CI, 46, 44		
Missing Pages	No		
Prepared By	Chagy	Cutting By	Chagy
Scanned By	Amrutha	Pages	49